సంపుటి :02 సంచిక :164 పేజీలు :06

వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com


Voice of the people

బుధవారం 21, ఆగస్టు 2025



# డ్రంక్ అండ్ డ్రైవ్.. టు జైల్ !

మద్యం తాగి వాహనాలు నడపడం ప్రమాదకరం



- మీతో పాటు ఎదుటివారి ప్రాణాలకూ సంకటం
- డ్రంక్ అండ్ డ్రైవ్‌పై వరంగల్ కమిషనరేట్ ఉక్కుపాదం

మద్యం తాగి వాహనాలు నడపడం అనేది వాహనదారులతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదకరం. దీనివల్ల ప్రమాదాలు, మరణాలు సంభవించడమే కాకుండా, అనేక కుటుంబాలు బాధపడాల్సి వస్తుంది. ఈ సమస్యను అరికట్టడానికి వరంగల్ పోలీస్ కమిషనరేట్ కఠినమైన చర్యలు తీసుకుంటున్నది. ఆగస్టు 9 నుంచి 16 వరకు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో 324 కేసులు నమోదయ్యాయి. 16 మందికి జైలు శిక్ష విధించగా, రూ.3.95 లక్షలకు పైగా జరిమానా విధించారు. ఈ నేపథ్యంలో, ప్రతి వాహనదారుడు తమ జీవితం, కుటుంబ భద్రత కోసం మద్యం తాగి వాహనం నడుపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

- అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి

02

- పది రోజుల నుంచి ప్రత్యేక డ్రైవ్
- మొత్తం 324 కేసులు.. 16 మందికి జైలు శిక్ష
- నిందితులకు రూ.3.95 లక్షలకు పైగా జరిమానా
- పదే పదే పట్టుబడితే లైసెన్స్ రద్దు
- సీపీ సన్ ప్రీత్ సింగ్

## కాళ్లు మొక్కుత యూరియా కావాలి

- బుధరావుపేట ధర్నాలో ఓ మహిళ రైతు వేడుకోలు
- ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పెద్ది
- యూరియా కోసం నెల్లికుదురులో రైతుల రాస్తారోకో
- వివిధ చోట్ల గంటల తరబడి క్యూలో ఉన్న రైతులు

03




## మేడారం జాతరకు రూ.150 కోట్లు

03

### జనవరి 28 నుంచి 31 వరకు మహా జాతర

సమ్మక్క సారక్క భక్తులకు శుభవార్త. మేడారం సమ్మక్క సారక్క జాతరకు ప్రభుత్వం రూ.150 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు బుధవారం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో రెండేళ్లకోసారి అత్యంత వైభవంగా సమ్మక్క సారక్క మహా జాతర జరగనున్న విషయం తెలిసిందే. ప్రతి జాతరకు ముందు నిర్వహణ కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయటం ఆనవాయితీగా వస్తుంది.




## ఏ టు జెడ్ @ మాయాబజార్

మూడును ఎనిమిది చేసిన వైనం

05

యూరియా ఎవరిస్తామంటే

## ఆ పార్టీ అభ్యర్థికి మద్దతు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

03





## మెలకువలను నేర్చుకోవాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- ఆత్మకూరులోని మహిళా కుట్టు శిక్షణా కేంద్రం సందర్శన

04

# నూతన రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలి

## నర్సంపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ కోరె కుమార స్వామి

అక్షర దర్బార్, చెన్నారావుపేట: ప్రభుత్వం అందించిన నూతన రేషన్ కార్డులను పేదలు సద్వినియోగం చేసుకోవాలని నర్సంపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ కోరె కుమార స్వామి పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో బుధవారం మండల కేంద్రంలో 150 కార్డులు మంజూరు చేసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ.. "మాకు రేషన్ కార్డులు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి గారికి రుణపడి



ఉంటాం. గత ప్రభుత్వం కార్డులు ఇవ్వకుండా మోసం చేసింది. ఇప్పుడు మా కుటుంబాలకు న్యాయం జరిగింది" అని పేర్కొన్నారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కాసర్ల సురేష్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గుగులోత్ ఈర్యా నాయక్, బొంత శ్రీను, కుండే కుమార స్వామి, జోరు వీరయ్య గౌడ్, మెంతుల రమేష్, మారెల్లి కుమార స్వామి, యువజన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు లక్క రాజు, పులి రమేష్, మహిళలు, లబ్ధిదారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి పరామర్శ



అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలం మైలారం గ్రామ బీజేపీ బూత్ అధ్యక్షుడు కన్నబోయిన రమేష్ తండ్రి కన్నెబోయిన సారయ్య ఇటీవల మరణించగా ఆయన కుటుంబ సభ్యులను పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎడునుతుల నిశిధర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు చందుపట్ల సత్యపాల్ రెడ్డి బుధవారం పరామర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాయరాకుల మొగిలి, జిల్లా ప్రధాన కార్యదర్శి తాటికొండ రవికిరణ్ గౌడ్, చదువు రామచంద్రారెడ్డి, మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి భూతం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# డ్రంక్ అండ్ డ్రైవ్.. టు జైల్!



అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి: మద్యం తాగి వాహనం నడపడం తనతో పాటు ఎదుటివారి వారికి సైతం ప్రమాదకరం. కానీ, కొందరు మందు బాబులు వినడం లేదు. తాము మద్యం తాగడమే కాదు.. అతి వేగంగా వాహనాల నడిపి ప్రమాదాల బారిన పడుతున్నారు. తమతో పాటు ఎదుటివారిని గాయపరుస్తున్నారు. కొన్నిచోట్ల మరణాలు సైతం సంభవిస్తున్నాయి. దీంతో వారిపైనే ఆధారంగా బతుకుతున్న వారి కుటుంబాలకు తీరని వేదనను మిగుల్చుతున్నారు. మరికొందరు దివ్యాంగులుగా మారి జీవితాంతం బాధపడుతున్నారు. ఇలా మద్యం తాగి వాహనాలు నడిపితే.. తీవ్ర పరిణామాలు ఉంటాయి. డ్రంక్ అండ్ డ్రైవింగ్పై వరంగల్ కమిషనరేట్ పోలీసులు సీరియస్గా ఉన్నారు. కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకుట లా అండ్ ఆర్డర్తో పాటు ట్రాఫిక్ పోలీసులు కమిషనరేట్ వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్లు నిర్వహిస్తున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్లో పదే పదే పట్టుబడితే వారి లైసెన్సు కూడా రద్దు చేస్తామని సీపీ హెచ్చరిస్తున్నారు. వాహన తనిఖీల్లో ఆగస్టు 9వ తేదీ నుంచి ఈనెల 16 వరకు.. డ్రంక్ అండ్ డ్రైవ్ 324 కేసులు నమోదయ్యాయి. న్యాయస్థానం 16 మంది నిందితులకు 2 రోజుల చొప్పున జైలు శిక్ష విధించిది. మొత్తంగా నిందితులకు రూ.3,95,400 జరిమానా విధించింది.

### - స్టేషన్ల వారీగా కేసులు..

హనుమకొండ ట్రాఫిక్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 121 నమోదయ్యాయి. న్యాయస్థానం నలుగురికి జైలు శిక్ష విధించింది. నిందితులకు మొత్తం రూ.1,36,400 జరిమానా విధించింది. కాజీపేట ట్రాఫిక్ స్టేషన్ పరిధిలో 106 కేసులు నమోదయ్యాయి. ఐదుగురికి జైలు శిక్ష పడింది. నిందితులకు మొత్తం రూ.1,69,300 జరిమానా పడింది. వరంగల్ ట్రాఫిక్ స్టేషన్ పరిధిలో 97 కేసులు నమోదయ్యాయి. ఐదుగురికి జైలు శిక్ష పడింది. నిందితులకు మొత్తం రూ.89,700 జరిమానా పడింది.

### - శిక్షలు.. జరిమానా ఇలా..

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వారికి మొదట కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇస్తారు. తర్వాత వారిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరచి, తగిన శిక్షలు విధిస్తున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ నేరం మోటార్ వాహనాల చట్టం కిందకు వస్తుంది. కొత్తగా వచ్చిన బీఎన్ఎస్ చట్టం డ్రంక్ అండ్ డ్రైవ్ను మరింత తీవ్రంగా పరిగణిస్తున్నది. దీని ప్రకారం, ఈనేరం కేవలం ట్రాఫిక్ ఉల్లంఘన మాత్రమే కాదు. ఇతరుల ప్రాణాలకు లేదా తన ప్రాణాలకు హాని కలిగించే ప్రమాదకరమైన చర్య. మద్యం తాగి మొదటిసారి పట్టుబడితే న్యాయస్థానం రూ.10,000 వరకు జరిమానా, లేదా గరిష్ఠంగా 6 నెలల వరకు జైలు శిక్ష విధిస్తుంది. నేర తీవ్రతను బట్టి కొన్ని సందర్భాల్లో రెండు శిక్షలనూ విధించవచ్చు. రెండు అంతకంటే ఎక్కువ సార్లు పట్టుబడితే రూ.15,000 వరకు జరిమానా, లేదా గరిష్ఠంగా 2 సంవత్సరాల వరకు జైలు శిక్ష ఉంటుంది. కొన్ని సందర్భాలలో, ఈ రెండు శిక్షలను కలిపి విధించవచ్చు. పదే పదే ఈ నేరానికి పాల్పడితే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయవచ్చు లేదా దీర్ఘకాలం పాటు సస్పెండ్ చేయవచ్చు.

- మద్యం తాగి వాహనాలు నడపడం ప్రమాదకరం
- మీతో పాటు ఎదుటివారి ప్రాణాలకూ సంకటం
- డ్రంక్ అండ్ డ్రైవ్పై వరంగల్ కమిషనరేట్ ఉక్కుపాదం
- పది రోజుల నుంచి ప్రత్యేక డ్రైవ్
- మొత్తం 324 కేసులు.. 16 మందికి జైలు శిక్ష
- నిందితులకు రూ.3.95 లక్షలకు పైగా జరిమానా
- పదే పదే పట్టుబడితే లైసెన్స్ రద్దు: సీపీ సన్ ప్రీత్ సింగ్

## గాయాలు జరిగితే.. మరణం సంభవిస్తే..

ఒకవేళ డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల ఎవరైనా స్వల్పంగా గాయపడితే, బీఎన్ఎస్ సెక్షన్ 125 ప్రకారం గరిష్ఠంగా 3 నెలల జైలు శిక్ష లేదా రూ.2,500 వరకు జరిమానా లేదా ఈ రెండూ విధించే అవకాశం ఉంది. తీవ్రమైన గాయాల పాలైతే, శిక్ష మరింత కఠినంగా ఉంటుంది. ఒకవేళ డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల నిర్లక్ష్యం లేదా నిర్లక్ష్యపూరిత చర్యల వల్ల మరణం సంభవిస్తే, బీఎన్ఎస్ సెక్షన్ 106 కింద గరిష్ఠంగా 10 సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటు భారీ జరిమానా విధించవచ్చు. ఈ నేరం నాన్-బెయిలబుల్ నేరంగా న్యాయస్థానం పరిగణించవచ్చు. రక్తంలో ఆల్కహాల్ స్థాయి భారతదేశంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నేరంగా పరిగణించడానికి రక్తంలో ఆల్కహాల్ స్థాయి 100 మి.లీ రక్తానికి 30 మి.గ్రా కంటే ఎక్కువగా ఉండాలి. ఈ నేరం కింద పట్టుబడిన వారికి స్పాట్లో జరిమానా ఉండదు. వారిని తప్పనిసరిగా కోర్టులో హాజరుపరచాల్సి ఉంటుంది. కోర్టు మాత్రమే వారికి జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించే అధికారం ఉంటుంది. కొన్ని నగరాల్లో ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులకు బీఎన్ఎస్ కింద నేరుగా ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నారు. దీనివల్ల నిందితులకు పాస్ పోర్ట్, వీసా లేదా ఉద్యోగాలకు పోలీసు క్లియరెన్స్ సర్టిఫికెట్లు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతాయి.



## యూరియా ఎవరిస్తామంటే

# ఆ పార్టీ అభ్యర్థికే మద్దతు

**- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణ ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో నిర్ణయం తీసుకుంటామని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వెల్లడించారు. తమకు ఢిల్లీలో బాస్‌లు లేరన్న మాజీ మంత్రి ఎన్డీఏ, ఇండి కూటమితో ఒప్పందం లేదని స్పష్టం చేశారు. బీసీల కోసం ఢిల్లీ, అంతరిక్షం వరకైనా వెళ్లి కొట్లాడుతామన్న కాంగ్రెస్ పార్టీ, ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా బలహీన వర్గాల వ్యక్తిని ఎందుకు ఎంపిక చేయలేదని ప్రశ్నించారు. సెప్టెంబర్ 9లోగా 2 లక్షల టన్నుల యూరియా ఎవరిస్తామంటే వారికే మా మద్దతిచ్చే అంశంపై పరిశీలిస్తామని ఆయన వెల్లడించారు. "మేము ఎన్డీఏ, ఇండి కూటమిలో లేము. మాకు ఢిల్లీలో ఏ బాస్‌లు లేరు. తెలంగాణ ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో నిర్ణయం తీసుకుంటాం.



ప్రస్తుతం రాష్ట్రంలో యురియా కొరత ఉంది. సెప్టెంబర్ 9లోగా 2 లక్షల టన్నుల యూరియా ఎవరిస్తామంటే ఆ పార్టీ అభ్యర్థికి మద్దతు ఇచ్చే అంశంపై ఆలోచిస్తాం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.

## చల్లా పరామర్శ



అక్షర దర్బార్, పరకాల: నడికూడ మండలంలోని చౌటుపర్తి, నడికూడ, కౌకొండ గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన ఎలుగటి రవీందర్ రెడ్డి, దుప్పటి మరియమ్మ, బురం పెద్ద మల్లయ్య, గోల్కొండ శాంతమ్మ, దంచనాల కమలాకర్ కుటుంబ సభ్యులను బుధవారం మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు.





## కాళ్లు మొక్కుతా..

# యూరియా కావాలి

- బుధరావుపేట ధర్నాలో ఓ మహిళ రైతు వేడుకోలు
- ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పెద్ది
- యూరియా కోసం నెల్లికుదురులో రైతుల రాస్తారోకో
- వివిధ చోట్ల గంటల తరబడి క్యూలో ఉన్న రైతులు

అక్షరదర్బార్, వరంగల్/ఖానాపురం : యూరియా కోసం రైతులు రోడ్డెక్కారు. తమకు యూరియా బస్తాలు కావాలనే డిమాండ్ తో ఆందోళనకు దిగారు. వివిధ మండలాల్లో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేట పీఏసీఎస్ వద్ద జరిగిన ధర్నాలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డితో పాటు బీఆర్ఎస్ నేతలు పలువురు పాల్గొన్నారు. ఇక్కడ ధర్నాలో ఓ మహిళ యూరియా కావాలని ప్రభుత్వ ఉద్యోగి కాళ్లకు దండం పెడుతూ వేడుకున్న దృశ్యం వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద రైతులు రాస్తారోకో నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోతు కవిత ఈ రాస్తారోకోలో పాల్గొన్నారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని చౌటపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. బుధరావుపేట, నెల్లికుదురులో కూడా రైతులు యూరియా కోసం తెల్లవారుజాము నుంచే క్యూలో గంటల తరబడి నిలబడ్డారు. నెల్లికుదురులో చెప్పులను లైన్ లో పెట్టారు. బుధరావుపేట, నెల్లికుదురులో ధర్నా, రాస్తారోకోలో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు యూరియా కొరతపై మండిపడ్డారు. యూరియా కొరతకు ముందస్తు ప్రణాళిక లేకపోవటమే కారణమని, రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున పంటలకు యూరియా వేయడానికి అనువైన సమయమని, అదను దాటకముందే యూరియా సరఫరా చేయాలని రైతులు కోరారు.



## మేడారం జాతరకు

# రూ.150 కోట్లు

**- జనవరి 28 నుంచి 31 వరకు మహా జాతర**

అక్షరదర్బార్, మేడారం : సమ్మక్క సారక్క భక్తులకు శుభవార్త. మేడారం సమ్మక్క సారక్క జాతరకు ప్రభుత్వం రూ.150 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు బుధవారం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో రెండేళ్లకోసారి అత్యంత వైభవంగా సమ్మక్క సారక్క మహా జాతర జరగనున్న విషయం తెలిసిందే. ప్రతి జాతరకు ముందు నిర్వహణ కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయటం ఆనవాయితీగా వస్తుంది. ఈసారి వచ్చే జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు మేడారంలో సమ్మక్క సారక్క మహా జాతర జరగనుంది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ జాతర నిర్వహణ కోసం ప్రభుత్వం రూ.150 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో మేడారం జాతర నిర్వహణకు ప్రతిపాదించిన పలు అభివృద్ధి పనులను చేపట్టే అవకాశం ఉంది.

## చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో

# సరుకుల పంపిణీ

అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండలం జూకల్ గ్రామంలో బుధవారం చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు మ్యాదరి సునీల్ ఆధ్వర్యంలో, రిటైర్డ్ నిట్ ప్రొఫెసర్ కునిశెట్టి సుబ్బారావు – సుశీలదేవి దంపతుల సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. సుబ్బారావు జన్మదినం, వారి కోడలు కునిశెట్టి లక్ష్మి పుట్టినరోజు సందర్భంగా 25 కుటుంబాలకు ఒక్కొక్కరికి 10 కిలోల బియ్యం, ఒక నూనె ప్యాకెట్, ఒక గోధుమ పిండి సహా మొత్తం రూ.20వేల విలువ చేసే సరుకులు పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి, మాజీ ఎంపీటీసీ తిరుపతి, గ్రామ కార్యదర్శి నవీన్, సొసైటీ డైరెక్టర్ గుర్రం మహేందర్, సాంబామూర్తి పాల్గొన్నారు.





## రోడ్డును మరమ్మత్తు చేయించాలి

అక్షర దర్బార్, శాయంపేట : కాట్రపల్లి నుండి గంగిరేణిగూడెం వరకు గతంలో నిర్మించిన బీటీ రోడ్ ప్రస్తుతం నడవలేని దుస్థితికి చేరుకుందని కాట్రపల్లి మాజీ ఎంపీటీసీ షేక్ అనిఫా గౌస్ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల కనీస అవసరాలు తీర్చడంలో విఫలమైందని విమర్శించారు. 42% బీసీ రిజర్వేషన్ అమలు చేసి గ్రామపంచాయతీ ఎన్నికలు వెంటనే నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో గొల్లపల్లి గ్రామానికి చెందిన బాబు పెద్ద రమేష్ బాబు, సాంబయ్య, పాక చిన్నరాజయ్య, బాబు చిన్నన్న, బాబు తిరుపతి, బాబు శ్రీను, బైకని సాంబయ్య, అరె తిరుపతి, పోతరాజ్ ఐలయ్య, నూనెటి రమేష్, ఎల్లవుల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

**తెలంగాణ పత్తి రైతుల సంఘం డిమాండ్**



అక్షర దర్బార్, దుగ్గొండి : కేంద్ర ప్రభుత్వం పత్తి దిగుమతులపై సుంకాలు ఎత్తివేయడం రైతాంగానికి తీవ్ర నష్టం చేస్తుందని తెలంగాణ పత్తి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ పుచ్చకాయల కృష్ణారెడ్డి, కో-కన్వీనర్ మూడ్ శోభన్ అన్నారు. దిగుమతులు పెరిగితే దేశ వ్యాపారులు తక్కువ ధరకు విదేశాల నుంచి పత్తి తెచ్చుకుని నిల్వచేసి, స్థానిక రైతులను దోపిడీ చేసే అవకాశం ఉందన్నారు. దీంతో చిన్న, సన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోతారని, పత్తి ధరలు పడిపోవడంతో ఆత్మహత్యలు పెరగవచ్చని హెచ్చరించారు. ఈ సంవత్సరం పత్తికి క్వింటాల్‌కు రూ.10,075 మద్దతు ధర ప్రకటించాలని, రైతులకు కీడు చేసే ఈ నిర్ణయాన్ని కేంద్రం వెంటనే వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# మెళకువలను నేర్చుకోవాలి

- **జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**
- **ఆత్మకూరు మహిళా కుట్టు శిక్షణా కేంద్రం సందర్శన**

హనుమకొండ, అక్షరదర్బార్: మహిళలు కుట్టుకు సంబంధించిన నైపుణ్యాలను శిక్షణ సమయంలో సద్వినియోగం చేసుకోవాలని, స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పిలుపునిచ్చారు. బుధవారం ఆమె ఆత్మకూరు మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు నైపుణ్య అభివృద్ధి కేంద్రాన్ని సందర్శించారు. శిక్షణలో మెలకువలను పూర్తిగా నేర్చుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో ఉపాధి లభించినా లేకున్నా స్వయం ఉపాధి ద్వారా సొంత కాళ్లపై నిలబడే అవకాశం ఉందని కలెక్టర్ అన్నారు. ప్రస్తుతం కేంద్రంలో 45 మంది మహిళలు అధునాతన కుట్టు మిషన్లతో శిక్షణ పొందుతున్నారని మహిళలు కలెక్టర్‌కు వివరించారు. మహిళా సంఘాల సహకారంతో అవసరమైన కుట్టు మిషన్లను కొనుగోలు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని డీఆర్డీఓ మేనేజర్ శ్రీనుకు ఆమె సూచించారు.

### ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన

ఆత్మకూరు మండలంలో పురోగతిలో ఉన్న పలు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను కూడా కలెక్టర్ స్నేహ శబరీష్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆత్మకూరు తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, డీపీఎం రాజేంద్రప్రసాద్, ఏపీఎం సుజాత తదితరులు పాల్గొన్నారు.





# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

అక్షర దర్బార్, భూపాలపల్లి : వర్షాల నేపథ్యంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం భూపాలపల్లి మండలం కమలాపూర్ గ్రామంలో వర్షాలతో దెబ్బతిన్న పెద్ద చెరువు కట్ట, మత్తడి ప్రాంతాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం భూపాలపల్లి మంజూరు నగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఇరిగేషన్, పీఆర్ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. కమలాపూర్ గ్రామ రైతుల కోసం గొల్లబుద్దారం దేవాదుల ప్రాజెక్టు నుండి కమలాపూర్ సాగు నీటి అవసరాల పనులను త్వరితగతిన ప్రారంభించి,పూర్తి చేసి రైతుల సాగునీటి అవసరాలను తీర్చాలన్నారు. వర్షాల నేపథ్యంలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు అందుబాటులో ఉండాలన్నారు.



# దామెర పీఎస్ తనిఖీ

**చేసిన వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ**




అక్షర దర్బార్, దామెర: దామెర పోలీస్ స్టేషన్ ను ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నేరాల నియంత్రణతో పాటు ప్రజల విశ్వాసాన్ని చూరగొనేలా పోలీసులు కృషి చేయాలని కేసుల నమోదు, క్రైమ్ రికార్డ్ లు, సన్నిహిత పిటిషన్ లు క్రైమ్ చాట్, ప్రాపర్టీ రూమ్, క్రైమ్ ఫైల్స్ ను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడుతూ పెండింగ్ కేసులు, దర్యాప్తులో ఉన్న కేసులను వేగంగా పూర్తి చేసి నేరస్థులకు శిక్ష పడేలా కృషి చేయాలని, ప్రజలతో వీపీఓలు మరింత సాన్నిహిత్యం పెంచుకుని, స్టేషన్‌కు వచ్చే ప్రతి పౌరుడిని గౌరవంతో చూడాలని యువతను తప్పుదోవ పట్టించే అంశాలపై, ముఖ్యంగా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై క్రమం తప్పకుండా అవగాహన కల్పించాలని సూచించారు.



శాయంపేటలో..



మొగుళ్ళపల్లిలో..



పరకాలలో..

# సాంకేతికతకు ఆద్యుడు రాజీవ్ గాంధీ

- **కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి**
- **ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి**

అక్షర దర్బార్ శాయంపేట : దేశంలో సాంకేతికతకు ఆధ్యుడు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. బుధవారం మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు చిందం రవి , బాసని మార్కండేయ, ఏరుకొండ శంకర్, మోతే వెంకన్న, గోపాల్ రెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

### మొగుళ్ళపల్లిలో..

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి మండల కేంద్రంలో బుధవారం రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తక్కలపల్లి రాజు. చిట్యాల వ్యవసాయ వైస్ చైర్మన్ మహ్మద్ రఫీ చౌరస్తా వద్ద రాజీవ్ గాంధీ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ క్యాతరాజు రమేష్ మండలంలోని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### పరకాలలో..

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దివంగత నేత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొయ్యడ శ్రీనివాస్ హాజరై రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా సేవాదళ్ అధ్యక్షులు బొచ్చు చందర్, బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్ల చిన్ని, సమన్వయ కమిటీ సభ్యులు చిన్నల గోనాథ్, ఎండి రంజాన్ అలీ, పంచగిరి జయమ్మ, మడికొండ సంపత్ పాల్గొన్నారు.

### చిట్యాలలో..

అక్షర దర్బార్, చిట్యాల :
చిట్యాల మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి ఉత్సవాలు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి నేతృత్వంలో కేక్ కట్ చేసి, రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రతినిధి దొడ్డి కిష్టయ్య, మండల ప్రధాన కార్యదర్శి గడ్డం కొమరయ్య, టౌన్ అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్ గౌడ్, యువజన అధ్యక్షుడు అల్లకొండ కుమార్, బీసీ సెల్ అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్, పిట్టల సాంబయ్య, ఎండి రాజ్ మహమ్మద్, బుర్ర మల్లేష్, ఏరుగొండ గణపతి, నర్ర శివరామకృష్ణ, పుల్ల సమ్మయ్య, సరికొమ్ముల సదయ్య, శనిగరం మొగిలి, అందుకుల రాజు తదితరులు పాల్గొన్నారు.



చిట్యాలలో..

# కలెక్టరేట్ లో కాల్ సెంటర్

**- కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



అక్షరదర్బార్, వరంగల్: జిల్లాలో యూరియా కొనుగోలు, ఇతర సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ లో ఏర్పాటుచేసిన కాల్ సెంటర్ ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రైతుల సౌకర్యం కోసం ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ 1800425 3424 టోల్ ఫ్రీ నెంబర్, 0870-2530812 9154252936 ఫోన్ నెంబర్లు జిల్లాలోని ప్రతి ఎరువుల విక్రయ దుకాణాల వద్ద ప్రదర్శించడం జరుగుతుందని, యూరియా కొనుగోలు ప్రక్రియ, ఇతర సమస్యలను పై నంబర్లకు సంప్రదించాలని కోరారు.

# పిచ్చి మొక్కలు, వర్షపు నీరు

**- ఇది ప్రభుత్వ కార్యాలయాల పరిస్థితి**



అక్షరదర్బార్, శాయంపేట: ప్రభుత్వ కార్యాలయాలు ప్రాంగణములో పిచ్చి మొక్కలు, వర్షం నీరుతో ఆపరిశుభ్రతంగా ఉంది. శాయంపేట మండల కేంద్రంలోని తహసిల్దార్, ఎంపీడీవో, డ్వాక్రా, తదితర కార్యాలయాలు ఒకే చోట ఉన్నాయి.ఇక్కడ పిచ్చి మొక్కలతో అపరిశుభ్రంగా, వర్షం నీరుతో ఉంది. వర్షం పడితే నీరు నిలిచిపోయి పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. స్వచ్ఛ భారత్ వంటి కార్యక్రమాలు నిర్వహించే ప్రభుత్వ కార్యాలయాల వద్దే ఇలా ఉండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేయాల్సిన అధికారులే పరిశుభ్రతను పాటించకపోవడం ప్రజలు ప్రశ్నిస్తున్నారు.మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు అపరిశుభ్రంగా ఉంటే గ్రామాలలోని ప్రభుత్వ కార్యాలయాలు ఏ విధంగా ఉంటాయోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.

# ట్రాఫిక్ చలాన్లు జమ చేయకుంటే
# వాహనాలు సీజ్

## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ హెచ్చరిక

హనుమకొండ, అక్షరదర్బార్:వరంగల్ కమిషన రేట్ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులు జరిమానాలు చెల్లించకపోతే వాహనాలను సీజ్ చేస్తామని కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ హెచ్చరించారు.ప్రస్తుతం 1,27,194 వాహ నాలపై రూ.33.28 కోట్లు విలువైన 11,71,094 చలాన్లు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన వివరిం చారు. ఇందులో వరంగల్ ట్రాఫిక్ పరిధిలో 3,35,450, కాజీపేటలో 3,60,423, హనుమ కొండలో 2,73,770, మిగిలిన ప్రాంతాల్లో 2,01,451 చలాన్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.పెండింగ్ చలాన్లను వసూలు చేసేందుకు ప్రత్యేక తనిఖీలు చేపడతామని, నగ రంలోని అన్ని కూడళ్లలో ఏర్పాటు చేసిన ఆటోమే టిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ANPR) కెమెరాల ద్వారా వాహనాలను గుర్తించి రోడ్డుపైనే ఆపి జరి మానాలు వసూలు చేస్తామని కమిషనర్ తెలిపారు. చెల్లించని పక్షంలో వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలిస్తామని స్పష్టం చేశారు. వాహనదారులు తక్షణమే తమ పెండింగ్ చలాన్లు క్లియర్ చేసుకోవాలని ఆయన సూచించారు.







# ఏ టు జెడ్ @మాయాబజార్

## - మూడును ఎనిమిది చేసిన వైనం

అక్షరదర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని మహాలక్ష్మి ఏ టు జెడ్ బజార్ మాయాబజార్ గా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. పరకాల పట్టణంలోని చైనా బజార్ (మహాలక్ష్మి ఏ టు జెడ్ బజార్) లో అన్ని రకాల గృహోపకరణ వస్తువులతో పాటు మహిళలు, పిల్లలు, పెద్దలకు సంబంధించిన షూస్, చెప్పులు, ఫ్యాన్సీ ఐటమ్ వస్తువులు కూడా దొరకడంతో పరకాల పట్టణంతోపాటు పరిసర గ్రామాల ప్రజలు తరచుగా షాపులోకి వెళ్లి వస్తువు లను కొనుగోలు చేస్తున్నారు. అలాంటి షాప్ యజమాని ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని




ఫిక్స్ రేట్ కు అమ్మబడునని ప్రకటించుకొని కంపెనీ రేట్లను మార్చి వాటిపై మార్కర్ తో రేట్లు కొట్టివేసి ఇష్టం ఉన్న రేట్లకు అమ్ముతున్నాడని వినియోగదా రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




## - రేట్స్ పై మార్కర్ దిద్దుబాటు..

పరకాలలోని మహాలక్ష్మి ఏ టు జెడ్ బజార్ లో ఒక కస్టమర్ పరగాన్ షూస్ తీసుకోగా దానిపై రూ.239 ఉంటే దానిని రూ.289గా కనపడే విధంగా మూడును ఎనిమిది చేసి అమ్ముతున్నాడని ఆరోపిం చారు. అదే విధంగా తక్కువ రేటు ఉన్నవాటిపై ఎక్కువ రేట్లు వేసి కొన్నింటికి బ్లాక్ మార్కర్ తో రేట్లు కనపడకుండా చేసి తన ఇష్టం ఉన్న రేట్లకు అమ్మి ప్రజలను మోసం చేస్తున్నాడని వినియోగదారులు పేర్కొంటున్నారు. అమాయక ప్రజలను ఆసరాగా చేసుకొని అనుమానం రాకుండా నిత్యం ప్రజలను మోసం చేస్తున్న షాపుపై చట్టరీత్యా చర్యలు తీసుకొని ప్రజలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

# కార్యకర్తలకు అండగా ఉంటా

## మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



అక్షర దర్బార్, పరకాల: అధికార పార్టీ నాయకుల వేధింపులు తట్టులేక పరకాల పోలీస్ స్టేషన్ లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నడికూడ మండల కేంద్రానికి చెందిన తాళ్ల శ్యామ్ రాజును పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బుధవారం పరామర్శించారు. శ్యామ్ రాజు ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, మీకు అండగా నేను ఉంటానని మాజీ ఎమ్మెల్యే తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వెంట నడికూడ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దూరిశెట్టి చంద్రమౌళి, తాజామాజీ సర్పంచ్ ఊర రవీందర్ రావు , సమన్వయ కమిటీ సభ్యులు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ వేడుకలకు పోలీసుల సూచనలు పాటించాలి

## దుగ్గొండి ఎస్సై రణధీర్ రెడ్డి



అక్షర దర్బార్, దుగ్గొండి : వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపు కోవడానికి పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని దుగ్గొండి ఎస్సై రావుల రణధీర్ రెడ్డి సూచించారు. మండపాలు ఏర్పాటు చేసుకునే ముందు పోలీసుల వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుని అనుమతి తీసుకోవాలని, ప్రతిమ ఎత్తు, మండపం స్థలం వంటి వివరాలు నమోదు చేయాలని తెలిపారు. మండపాల వద్ద నిర్వాహకుల పేర్లు, ఫోన్ నంబర్లు ఉంచాలని, రాత్రి 10 తర్వాత మైకులను ఆపాలని సూచించారు. అలాగే శబ్ద కాలుష్యం నివారణకు తక్కువ శబ్దం వచ్చే స్పీకర్లను వినియోగించుకోవాలని, మద్యం సేవించడం, పేకాట–జూదం, అసభ్యకర నృత్యాలకు అవకాశం ఇవ్వరాదని హెచ్చరించారు. ఏదైనా సమస్య తలెత్తినట్లయితే వెంటనే 100కు డయల్ చేయాలని ఎస్సై రణధీర్ రెడ్డి పిలుపునిచ్చారు.

# దొంగతనం చేసిన వ్యక్తి అరెస్టు

అక్షర దర్బార్ శాయంపేట : కిరాణం షాప్ షెట్టర్ తాళం పగలగొట్టి డబ్బులు దొంగలించిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్టు శాయంపేట ఎస్సై జె పరమేశ్వర్ తెలిపారు.ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం శాయంపేట మండలం మైలారం గ్రామానికి చెందిన మూల రాజు కిరాణం షాపు షట్టర్ కు వేసిన తాళం రాత్రి సమయంలో అదే గ్రామానికి చెందిన ఆకారపు కుమారస్వామి ముందుగా వేసుకున్న పథకం ప్రకారం తాళం పగులగొట్టి లాకర్ లోని రూ. 10వేల నగదు దొంగతనం చేశాడు. దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

# బిట్స్ పిలానీ పరిశోధకుడికి ఘన సన్మానం

## - సింగరేణి ఉద్యోగి కుమారుడి ప్రతిభకు అంతర్జాతీయ గుర్తింపు



అక్షరదర్బార్ భూపాలపల్లి: భూపాలపల్లి కృష్ణ కాలనీకి చెందిన యువ శాస్త్రవేత్త బుర్ర మణిదీప్ గౌడ్ అంతర్జాతీయ స్థాయిలో తన ప్రతిభను చాటుకొని స్వస్థలానికి గర్వకారణంగా నిలిచాడు. గోవా రాష్ట్రంలోని ప్రసిద్ధ బిట్స్ పిలానీ – గోవా క్యాంపస్ లో సైన్స్ విభాగంలో పీహెచ్ డీ చేస్తున్న మణిదీప్ గౌడ్ ఇటీవల చేసిన పరిశోధన అంతర్జాతీయ శాస్త్రీయ వర్గాల దృష్టిని ఆకర్షించింది. ఆయన రాసిన పరి శోధన పత్రం "హోలిన్ ప్రోటీన్" పై చేసిన అధ్యయనం, ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రీయ పత్రిక FEBS Letters లో కవర్ ఆర్టికల్ గా ఎంపికై ప్రచురితమైంది. తన పరిశోధనలో మణిదీప్ గౌడ్ వైరస్‌లు బాక్టీరియాలను ఎలా విచ్ఛిన్నం చేసి కొత్త వైరస్ కణాలను విడుదల చేస్తాయో లోతుగా అధ్యయనం చేశారు. ఈ కనుగొన్న అంశం భవిష్యత్‌లో వైద్యరంగానికి, బయోటెక్నాలజీ విభా గానికి ఉపయోగపడే అవకాశముందని శాస్త్రవే త్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ కనుగొన్న దాని ద్వారా కొత్త చికిత్సా పద్ధతులు, యాంటీ వైరల్ థెరపీల అభివృద్ధికి మార్గం సుగమమవు తుందని భావిస్తున్నారు. మణిదీప్ గౌడ్ తండ్రి బుర్ర రాజయ్య గౌడ్ సింగరేణి భూపాలపల్లి ప్రాంతంలోని కేటీకే ఓసీ–IIలో ఈపీ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. చిన్న పట్టణం నుంచి వచ్చి, ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన పరిశో ధన పత్రాన్ని రాయడం మణిదీప్ కృషికి నిదర్శ నంగా నిలిచింది. తన కుమారుడు సాధించిన విజయంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ, మణిదీప్ గౌడ్ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరో హించాలని ఆకాంక్షించారు. ఈ అంతర్జాతీయ విజయాన్ని పురస్కరించుకుని, బుధవారం స్థానికులు, గౌడ సంఘం నాయకులు భూపాలప ల్లిలో మణిదీప్ గౌడ్‌కు ఘన సన్మానం అందజే శారు. పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించి ఆయన ప్రతిభను అభినందించారు. ఈ సందర్భంగా తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ, "భూపాలపల్లి నుంచి ఒక యువ శాస్త్రవేత్త అంత ర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం గర్వకా రణం. మణిదీప్ గౌడ్ పరిశోధనలు రాబోయే కాలంలో శాస్త్ర, వైద్య రంగాలకు ఉపయోగపడ తాయి. మణిదీప్ గౌడ్ భవిష్యత్తులో మరింత గొప్ప శిఖరాలను అధిరోహించాలని కోరుకుం టున్నాం" అన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పెరుమాండ్ల తిరుపతి గౌడ్, మాజీ కౌన్సిలర్ పానుగంటి హారిక శ్రీనివాస్ గౌడ్, చెల్పూరు బల్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీపతి సదానందం గౌడ్, శ్రీపతి చంద్రమౌళి గౌడ్, గడ్డం సదానందం గౌడ్, ముత్యాల రాజబాబు గౌడ్, తాళ్లపెల్లి శ్రీనివాస్ గౌడ్, పంజాల శ్రీధర్ గౌడ్, గండి చిరంజీవి గౌడ్, పెరుమాండ్ల రేవంత్ గౌడ్, శ్రీపతి కార్తీక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915